స్థానిక ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

వంగూరు, ఫిబ్రవరి 11 : త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. మంగళవారం చారకొండ, వంగూరు మండలాల ముఖ్యనేతలతో మండలంలోని సర్వారెడ్డిపల్లిలో సమావేశం అయ్యాయి. ఈ సందర్భంగా గువ్వల మాట్లాడుతూ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలను గాలికొదిలేసి పాలన చేతకాగ ప్రతిపక్ష పార్టీపై ఆరోపణలు చేస్తూ కాలం గడుతుకుంటున్నదని దుయ్యబట్టారు. పార్టీ శ్రేణులు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించి బీఆర్ఎస్ గెలుపు కోసం ఇప్పటి నుంచి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఎత్తపు బాలయ్య పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వంగూరు, చారకొండ నేతలు రవీందర్, అంజి, దేవా, లక్ష్మణ్, సత్యం, మురళి, సాయిలు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తాం



మార్కండేయ లిఫ్ట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బిజినేపల్లి, ఫిబ్రవరి 11 : ప్రతి ఎకరాకు సాగునీటిని అందించేందుకు లక్ష్యంగా ఎక్కడికక్కడ కాల్వలు తీసి నీటిని పారిస్తున్నట్లు ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని శాయిన్‌పల్లి శివారులో నూతనంగా నిర్మించిన మార్కండేయ రిజర్వాయర్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇరిగేషన్ అధికారులు పార్థసారథి, శివరాములుతో కలిసి పరిశీలించి రెండు పంటలకు నీరు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాములు, అవంతి, వెంకటస్వామి, తిరుపతయ్య, రాజేందర్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, రాంచందర్‌నాయక్, మల్లేష్ తదితరులు ఉన్నారు. కాగా గౌరారం వనపర్తి జిల్లా ఘనపురం మండలం సల్కరాపూర్ గ్రామం వరకు బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిలు పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సాయిచరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే వంశీకృష్ణ

అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చారకొండ, ఫిబ్రవరి 11: గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంతో పాటు అగ్రహారంతండా, సారంబండతండాలో పలుఅభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గురువయ్యగౌడ్, మాజీజడ్పీటీసీ వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

అరుదైన శస్త్ర చికిత్స చేసిన ఎమ్మెల్యే

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 11 : పట్టణంలోని ఉచిత సర్జికల్ క్యాంప్‌లో భాగంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మంగళవారం అరుదైన శస్త్ర చికిత్స చేసి కణితిని తొలగించిన ఘటన అచ్చంపేట ఏరియా దవాఖానాలో చోటుచేసుకున్నది. వివరాలిలా.. మూడురోజుల నుంచి సీబీఎంట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత సర్జికల్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా చారగొండ మండలానికి చెందిన గోరేటి లక్ష్మమ్మ గత కొంత కాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నారు. విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్వయంగా శస్త్ర చికిత్సచేసి కణితిని విజయవంతంగా తొలగించారు. అనంతరం బాధితులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ ప్రదీప్, హెడ్ నర్స్ అచ్చాలి, ఇతర వైద్యులు సిబ్బంది శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సర్వరోగాల నుంచి విముక్తి

ధ్యానంపై తెలుపుతున్న యోగా గురువు

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 11 : ప్రతిరోజూ క్రమం తప్పకుండా ధ్యానం చేయడం వలన సర్వరోగాల నుంచి విముక్తి పొందవచ్చని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. మంగళవారం గోప్లాపురం, శింగవరం గ్రామాల్లో ధ్యానంపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలనొప్పి నుంచి క్యాన్సర్ వరకు వివిధ రోగాల నుంచి ధ్యానం ద్వారా దూరం చేయొచ్చని ఆయన పేర్కొన్నారు. అంతే కాక నిత్య జీవితంలో అనేక ఒత్తిళ్ల నుంచి ధ్యానంతో ఉపశమనం పొందవచ్చని ఆయన సూచించారు. భవిష్యత్తులో గుండె జబ్బులు, షుగర్, బీపీ వంటి వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకృష్ణారెడ్డి, శైలజ, సుభద్ర, వెంకటలక్ష్మి, రేణుక, సవారయ్య, రాజేశ్వరి, మద్ధిలేటి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలపై వాల్‌పోస్టర్లు

పోస్టర్లను గోడలకు అంటిస్తున్న గ్రామస్తులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 11: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న తీరుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో బీఆర్ఎస్ వాల్‌పోస్టర్లను ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేశ్ ముద్రించిన వాల్‌పోస్టర్లను నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పంపిణీ చేస్తున్నారు. మంగళవారం మండలంలోని తర్నికల్‌లో గ్రామస్తులు వాల్‌పోస్టర్‌ను గోడలకు అంటించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియ జేయునది ఏమనగా, Palusa Suvarna W/o Late.Palusa sreedhar Goud, aged 47 years, Occ: House wife, R/o H.No.16-111/2, Vinoba Nagar Colony, Nagarkurnool Dist., **Applicant / Borrower** నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, జడ్చర్ల బ్రాంచ్ గారికి ఇట్టి ఆస్తిని తనఖా (Mortgage) పెట్టి అప్పు తీసుకోవటానికి దరఖాస్తు చేసియున్నారు. ఇట్టి ఆస్తి విషయములో ఎవరికైనా ఎలాంటి హక్కుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల ఈ క్రింది అడ్రస్సుకు (3) రోజుల లోపల తెలియ జేయగలరు. లేని పక్షంలో ఇట్టి ఆస్తిపై ఎలాంటి అభ్యంత రములు లేవని భావించి నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, జడ్చర్ల బ్రాంచ్ వారు షెడ్యూల్ ఆస్తిని తనఖా పెట్టుకొని అప్పును మంజూరు చేయుదురు. తరువాత వచ్చిన ఆక్షేపణలు చెల్లనేరవు.

SCHEDULE OF THE PROPERTY:
All that the part & Parcel of Residential House bearing No.16-111/2 Over Plot No.17, an extent of 149 Sq. yards, RCC roof plinth area 107.50 Sq.fts., with open place, situated within the limits of Vinoba Nagar Colony, Nagarkurnool Dist.,
Bounded by: East : 20ft road, **West:** Plot no.19, **North:**20ft road, **South:** House of P. Muralidhar Goud.

K. CHANDRA MOULI, B.Com., LLB
Advocate, New Gunj, Hanuman Nagar, Mahabubnagar. Cell: 9440330760

తప్పులు లేకుండా దరఖాస్తు చేయాలి

కల్వకుర్తి, ఫిబ్రవరి 11: జనన, మరణ ధృవీకరణ పత్రాల కోసం తప్పుల్లేకుండా దరఖాస్తు చేయాలని మీసేవ ఆపరేటర్లకు మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ సూచించారు. మంగళవారం స్థానిక చాంబర్‌లో ఆపరేటర్లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. తప్పుల్లేకుండా, ఒకటికి రెండుసార్లు సరిచూసుకున్న తర్వాత దరఖాస్తు నమోదుచేయాలని ఆపరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో మీసేవ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని మార్చాలని వినతి

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి11: మండలంలోని ఎల్లికట్ట పంచాయతీ కార్యదర్శిని మార్చి ఆమె స్థానంలో మరొకరిని నియమించాలని గ్రామస్తులు ఎంపీడీఓ వెంకట్రాములుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. వినతి అందించిన వారిలో లింగమయ్య, భీమయ్య, కేశవులు, పాండు, తిరుపతి, రవి, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

అనుమతుల్లేకుండా ఇసుక రవాణా చేయొద్దు

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

ఉప్పునుంతల : మొల్గర సమీపంలో ఇసుకరీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్,ఎస్పీ

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 11 : అనుమతులు లేకుండా ఎలాంటి అక్రమ ఇసుక రవాణా, మైనింగ్ తవ్వకాలు చేపట్టిన కఠినచర్యలు తప్పవని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో పర్యటించిన ఆయన అనంతరం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఇసుక అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని మైనింగ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి సీజ్ చేసి వేలం వేస్తామన్నారు. జిల్లాలో ఉన్న టాస్క్‌ఫోర్స్ విభాగం ప్రత్యేకంగా డీ ఎస్పీ సత్యనారాయణతో ఏర్పాటు చేస్తామన్నారు. సీసీఐ సీఐ శంకర్ ఇద్దరు ఎస్సైలు అభిషేక్‌రెడ్డి, పర్వతాలుతో పాటు 10మంది సిబ్బంది ఉంటారన్నారు. జిల్లాలో అక్రమ ఇసుక, మైనింగ్‌పై పనిచేస్తుందన్నారు. వంగూరు, ఉప్పునుంతల, తెల్కపల్లి, వెల్దండ, తాడూరు, కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ మండలాల్లో ఉన్న పోలీస్ అధికారులు ఇతర విభాగాల వారితో కో ఆర్డినేట్ చేసి అక్రమాలను అరికట్టాల్సి ఉందన్నారు.

ఇసుక రీచ్‌లను పరిశీలించిన కలెక్టర్,ఎస్పీ

ఉప్పునుంతల, ఫిబ్రవరి 11 : ఉప్పునుంతల మండలంలోని మొల్గర, పెద్దాపూర్, తిర్మలాపూర్ గ్రామాల్లోని ఇసుకరీచ్‌లను మంగళవారం కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన వారు ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు తీసుకెళ్లాలన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల నిఘా పకడ్బందీగా ఉండాలన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక గాని మైనింగ్‌గాని తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ రవాణాకు ఉపయోగించే వాహనాల మైనింగ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లానిఘా విభాగం ద్వారా వివరాలను సేకరించి చర్యలు తీసుకుంటామన్నారు. వారివెంట అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్, ఎస్సై వెంకట్‌రెడ్డి, స్పెషల్‌బ్రాంచ్ సీఐ నర్సింహారావు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శంకర్, తాసీల్దార్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌కు పాల్పడితే జైలుకే :ఎస్పీ

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 11: అనుమతి లేకుండా మైనింగ్, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే జైలుకు పంపుతామని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమ మైనింగ్, ఇసుక తరలింపుపై ప్రభుత్వం రివ్యూ నిర్వహించిన నేపథ్యంలో ఎస్పీ పలు సూచనలు చేశారు. అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహనాలను మైనింగ్ యాక్టు కింద కేసులు నమోదు చేసి సీజ్ చేస్తామన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, మైనింగ్ చేస్తే వారిపై దొంగతనం కింద, మైనింగ్ యాక్టు కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు. జిల్లా నిఘా విభాగం ద్వారా వివరాలు సేకరిస్తున్నామని, ఆధారాలతో సహా అక్రమ మైనింగ్, ఇసుక రవాణాచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక అక్రమాలపై ఉక్కుపాదం మోపేందుకు జిల్లాలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ విభాగాన్ని డీఎస్పీ సత్యనారాయణ స్థాయి అధికారి సమక్షంలో ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంలో వ్యక్తికి గాయాలు

బిజినేపల్లి, ఫిబ్రవరి 11 : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల మహబూబ్‌నగర్‌కు చెందిన బాబు అనే ప్రైవేట్ కార్మికుడు బిజినేపల్లిలోని మహబూబ్‌నగర్ రహదారిలో విద్యుత్ పనులు చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా షాక్‌కు గురై గాయాలైనట్లు తెలిపారు. ఇతన్ని మొదట నాగర్‌కర్నూల్ దవాఖానకు అనంతరం మెరుగైన వైద్యంకోసం మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఏఈ రాకేశ్‌రెడ్డి తెలిపారు.

యువతి అదృశ్యం

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 11 : తెలకపల్లి మండలంలోని జంగమోనిపల్లి గ్రామానికి చెందిన వేటూరి పల్లవి అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఈనెల 10వ తేదీన రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేసిన అనంతరం నిద్రకు వెళ్లారు. మధ్యరాత్రి లేచి చూడగా తమ కూతురు కనిపించలేదని కుటుంబ సభ్యులు వెల్లడించారన్నారు. ఇదే గ్రామానికి చెందిన తగిలి శ్రీశైలం అనే యువకుడు తమ కూతురును తీసుకెళ్లాడని యువతి తల్లి వేటూరి జ్యోతి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వట్టిపల్లిలో దొంగతనం..

తెలకపల్లి మండలంలోని వట్టిపల్లిలో సూర్యకల్యాణ్‌గౌడ్ కిరాణదుకాణంలో సోమవారం రాత్రిగుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. గుర్తుతెలియని దుండగులు తాళాలు పగులగొట్టి రూ.35వేల నగదు ఎత్తుకెళ్లారని, ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగకర్నూల్, ఫిబ్రవరి 11 : సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా భూసేకరణ పనులు వేగవంతం చేయాలని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా కార్యాలయ సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లాలోని ఆర్డీవోలు, నీటి పారుదల, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల అధికారులు, తాసీల్దార్లతో సాగునీటి ప్రాజెక్టుల జాతీయ రహదారి నిర్మాణం కోసం భూసేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేందుకు భూసేకరణ అవసరమన్నారు. జిల్లాలోని తాడూరు, బిజినేపల్లి, వెల్దండ, కల్వకుర్తి, తిమ్మాజిపేట, ఊరుకొండ, వంగూరు మండలాల్లో సేకరిస్తున్న భూసేకరణపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ చర్చించారు. జిల్లాలో నిర్మాణ దశలో కొనసాగుతున్న ఎత్తిపోతల పథకాలకు కావాల్సిన భూసేకరణ పనులను పెండింగ్‌లో లేకుండా చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ నియోజకవర్గాల్లోని జాతీయ రహదారికి సేకరించాల్సిన భూమి వేగవంతం చేయాలని సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ప్యాకేజీ 29, 30 ఇంకా సేకరించాల్సిన భూమి ఎంత ఉందో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, మహబూబ్‌నగర్ జిల్లా బీమా ప్రాజెక్టు భూసేకరణ అధికారి మధుసూదన్‌నాయక్, ఆర్డీవో, నీటి పారుదలశాఖ అధికారులు, జాతీయ రహదారుల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రాల్లో ప్రసవాలు పెంచాలి

పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 11 : ఆరోగ్యకేంద్రాల్లో సుఖప్రసవాలు పెంచాలని డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి అన్నారు. తెలకపల్లి మండలంలోని చిన్నముద్దునూరు, గౌరారం, తెలకపల్లి, రఘుపతిపేట పల్లె దవాఖానాలతో పాటు పీహెచ్‌సీలను మంగళవారం డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలను, రికార్డులను పరిశీలించి మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యకేంద్రాల్లో ప్రసవాలను పెంచాలని వైద్యాధికారులకు సూచించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

అభ్యసన సామర్థ్యాలను తెలుసుకుంటున్న డీఈవో

నాగర్‌కర్నూల్ రూరల్, ఫిబ్రవరి 11: జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం రాత్రి డీఈవో రమేశ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిన భోజనాన్ని ఆయన పరిశీలించారు. వండే బియ్యాన్ని ఒక రోజు ముందే శుభ్రం చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలని వంట ఏజెన్సీకి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ ముచ్చటించారు.విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయని ఇంకా ఏమేమి ఏర్పాటు చేయాలని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రెండు జతల యూనిఫాం, పుస్తకాలు, నోట్ పుస్తకాలు విద్యార్థులకు అందినవా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఏమైనా సమస్యలుంటే నివేదిక ఇవ్వాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనాన్ని అందించాలన్నారు.

విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని డీఈవో ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాలలోనే డీఈవో రాత్రి బస చేయనున్నారు. వారివెంట సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పెల్‌బీ విజేతలకు నగదు, బహుమతులు

నాగర్‌కర్నూల్ రూరల్, ఫిబ్రవరి 11 : తెలకపల్లి మండలస్థాయి స్పెల్‌బీ(ఆంగ్ల పదజాలం)పోటీల్లో మండలస్థాయిలో ప్రతిభ కనబర్చి ప్రథమస్థానం సాధించిన గౌరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన శ్వేత 4వ, అనోన్య 5వ తరగతుల ఇద్దరు విద్యార్థులకు సీఎల్ఆర్ విద్యా సంస్థ కరస్పాండెంట్ వి.రాజమహేందర్‌రెడ్డి నగదుతోపాటు బహుమతులు అందించినట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రవి, సునీల్‌కుమార్, కవిత, శ్రావణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేసే వరకు పోరాటం

దీక్షలో మాట్లాడుతున్న సీపీఎం నేత బాలస్వామి

చారకొండ, ఫిబ్రవరి 11: కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బైపాస్‌లో ఇండ్లు కోల్పోతున్న బాధితులకు ప్రభుత్వం న్యాయం చేసేంత వరకు పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా నేత బాలస్వామి అన్నారు. మంగళవారం మండలంలో సీపీఎం ఆధ్వర్యంలో బైపాస్ బాధితులు నిరహార దీక్షలు ప్రారంభించి మాట్లాడారు.. బాధితులకు కనీసం ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపకుండా ఇండ్లను కూల్చివేసి బాధితులను రోడ్డుపాలు చేసిందన్నారు. ఇండ్లు కోల్పోయిన బాధితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధితులు రాజు, విజయ, అలివేలు, చిట్టెమ్మ, బాల్‌నారాయణ, విష్ణు, లింగయ్య, అనసూయమ్మ, సుగుణమ్మ, యాదమ్మ, లాలమ్మ, వెంకటమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌చట్టాన్ని బీజేపీ నిర్వీర్యం చేస్తున్నది

కొల్లాపూర్, ఫిబ్రవరి 11 : కేంద్రప్రభుత్వం వక్ఫ్‌చట్టాన్ని నిర్వీర్యం చేసి మైనారిటీ హక్కులకు భంగం కలిగిస్తోందని ఆవాజ్ కమిటీ జిల్లా కన్వీనర్ ఎండీ సలీం అన్నారు. మంగళవారం కొల్లాపూర్ పట్టణంలో ఆవాజ్ కమిటీ క్యాలెండర్‌ను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రమ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వక్ఫ్‌చట్టంలో చాలా లోపాలు ఉన్నాయన్నారు. కేంద్రం తెచ్చిన చట్టంతో వక్ఫ్ భూములను ఆక్రమించుకునేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. బీజేపీ వక్ఫ్ చట్టాన్ని బలహీనపర్చినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో మైనారిటీల హక్కుల కోసం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ ఎంపీడీవోగా జయరాం

కొల్లాపూర్, ఫిబ్రవరి 11 : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా మంగళవారం జయరాం విజయ్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా పనిచేశారు. అక్కడి నుంచి బదిలీపై కొల్లాపూర్ మండలానికి ఎంపీడీవోగా వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన భాస్కర్ తిరిగి నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. రెగ్యులర్ ఎంపీడీవో రావడంతో మండలంలోని పలుగ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు జరుగుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 11: మండలంలోని కోడుపర్తి సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఏ శ్రీనివాస్‌రావు, ఏఈ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌పరిధిలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ 3.15 స్థానంలో 5 ఎంవీఏ ఏర్పాటు చేస్తున్నామని, దీని వలన ఉదయం 8గంటల నుంచి మధ్యహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వారు తెలిపారు. కోడుపర్తితోపాటు వెంకాయపల్లి, పోతిరెడ్డిపల్లి, బావాజీపల్లి, అప్పాజిపల్లి, రాంరెడ్డిపల్లి, బలాన్‌పల్లి, పర్వతాయపల్లి, కుమ్మెరతండా తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, రైతులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి రిమాండ్

లింగాల, ఫిబ్రవరి 11 : మద్యంతాగి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నాగరాజు మంగళవారం తెలిపారు. మండలంలోని అప్పాయిపల్లి గ్రామానికి చెందిన రమేశ్, నాగరాజు అనే ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా పోలీసు తనిఖీలో దొరికినట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తులపై కేసునమోదు చేసి అచ్చంటపే మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా 5రోజుల శిక్ష విధించగా కల్వకుర్తి జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికీ గాయాలు

ఊర్కొండ, ఫిబ్రవరి11: రెండు బైకులు ఢీకొని ఇద్దరికీ గాయాలైన సంఘటన మండలంలో మాదారం శివారులో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణదేవ తెలిపిన వివరాల మేరకు.. గుడిగాన్‌పల్లికి చెందిన భీమని వెంకటయ్య తాడూరుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఎదురుగా తలకొండపల్లి మండలం బదనాపూన్ గ్రామానికి చెందిన అనిల్ బైక్‌పై వస్తూ మాదారం శివారులో ఢీకొట్టడంతో ఇరువురికి గాయాలు కాగా స్థానికులు చికిత్సనిమిత్తం 108లో కల్వకుర్తి ప్రభుత్వా దవాఖానకు తరలించారు. శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని ఎస్సై పేర్కొన్నారు.

గేమ్యానాయక్‌తండాను గ్రామ పంచాయతీగా గుర్తించాలి

కొల్లాపూర్, ఫిబ్రవరి 11 : మండలంలోని గేమ్యానాయక్ తండాను గ్రామ పంచాయితీగా చేయాలని మంగళవారం ఆర్